క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బాలునాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లేన్ మార్పిడి ఉన్న కారణంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11కేవీ హాలియా టౌన్ పరిధిలో సాయిప్రతాప్‌నగర్ కాలనీ, అంగడిబజార్, డీవీకే రోడ్డు, వీరయ్య నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా ఇబ్రహీంపేట ఫీడర్, నాయుడు పాలెం ఫీడర్ కింద ఉన్న ప్రాంతాలు ఇబ్రహీంపేట, పాలెం, మదారిగూడెం, పేరూర్ గ్రామాలకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగ దారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

సీపీఐ మండల కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి

దేవరకొండ : సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శిగా దేప సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ కార్యదర్శిగా నూనె రామస్వామి, కార్యవర్గ సభ్యులుగా కేవవరెడ్డి, వెంకట్రాములు, రంగారెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, రాంరెడ్డి, పందుల యాదయ్య, సులోచన, ఎండీ మైనొద్దీన్, వెంకటయ్యతో పాటు మరో 33మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని 435 సర్వే నంబరులోని 30ఎకరాల ప్రభుత్వ భూమిని సోమవారం మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆర్‌ఐ శ్యాంతో కలిసి పరిశీలించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. అయితే ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించడం జరుగుతుందన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో అశ్రీత్‌కు కాంస్య పథకం



మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో పట్టణానికి చెందిన రాపోలు అశ్రీత్ కాంస్య పథకాన్ని సాధించాడు. పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుధీర్-మమత దంపతుల కుమారుడు అశ్రీత్ ఐదో తరగతి చదువుతున్నాడు. అశ్రీత్‌కు చిన్నతనం నుంచి స్కేటింగ్‌పై మక్కువ ఉండటంతో కోచ్ వద్ద శిక్షణ పొందాడు. గతంలో పాఠశాలలు, జిల్లా స్థాయిలో బహుమతులు సాధించాడు. 11 ఏళ్ల వయస్సువారిలో ప్రతిభను కనబర్చి కాంస్య పథకాన్ని సాధించాడు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిగా వెంకటేశం



మిర్యాలగూడ : మండల పరిధిలోని అవంతీపురం గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా వెంకటేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన హైదరాబాద్ గడ్డి అన్నారం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.శ్రీధర్ హుజూర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశాన్ని టీఎన్‌జీఓస్ మార్కెట్ ఉద్యోగస్తుల రాష్ట్ర అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, ముక్రంలు శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణపట్టె ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ : నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లు నుంచి కిందకు నీరు విడుదల చేయడంతో కృష్ణపట్టె ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఒక ప్రకటనలో సూచించారు. పరివాహక ప్రాంతాలైన నడిగడ్డ, నల్లమెట్టితండా, చిట్యాల, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం, ఇర్కిగూడెం, వాడపల్లి, గణేషపహాడ్ ప్రజలను అప్రమత్తం చేశారు. జాలర్లను వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

పోలీస్ వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

హాలియా : నల్లగొండ హెడ్‌క్వార్టర్ పోలీస్ వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అనుముల మండలంలోని పంగవాని కుంట గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున సాగర్ నుంచి నల్లగొండకు వెళ్తున్న నల్లగొండ హెడ్ క్వార్టర్ పోలీస్ వాహనం సాగర్-నల్లగొండ రహదారిపై పంగవానికుంట గ్రామ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆ గ్రామానికి చెందిన బైరు చెన్నయ్య(52)ను ఢీకొట్టింది. దీంతో బైరు చెన్నయ్య రోడ్డుపై ఎగిరి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్న య్య మృతిపై గ్రామస్తులు, బంధువులు కొంతసేపు రాస్తారోకో చేశారు. ఈ విషయంపై హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డిని వివరణ కోరగా నల్లగొండ హెడ్‌క్వాటర్ పోలీస్ వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడని, దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన పేర్కొన్నారు.

‘స్వచ్ఛదనం-పచ్చదనం’లో పాల్గొనాలి



మిర్యాలగూడ : మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



కొండమల్లేపల్లి : పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ, తదితర అధికారులు

మిర్యాలగూడ టౌన్ : ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంపై మెప్మా ఆర్పీలు, శానిటేషన్ జవాన్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, డీఈ వెంకన్న, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని స్వచ్ఛదనం- పచ్చదనంగా మార్చాలి

మిర్యాలగూడ : నియోజకవర్గాన్ని స్వచ్ఛదనంగా-పచ్చదనంగా మార్చాల్సిన అవసరం అందరిపై ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం- పచ్చదనం ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మండలంలోని యాద్గారపల్లిలో మొక్కలను నాటి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ధీరావత్‌తండాలో..

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మిర్యాలగూడ మండల పరిధిలోని ధీరావత్‌తండా గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ , ఆశాలు, టీచర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : గ్రామపంచాయతీ ఆవరణలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ఆర్డీఓ శ్రీరాములు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకుముందు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ద్వారక్, డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావులు, ఎంపీడీఓ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, ఎంపీఓ నర్సింహారావు, ఫారెస్ట్ ఆఫీసర్ సైదిరెడ్డి, ఏపీఎం బి. శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, పాల్గొన్నారు.

పచ్చదనం పెంచడమే లక్ష్యం..

హాలియా : హాలియా మున్సిపాలిటీలో గ్రీనరీ పెంచడమే లక్ష్యంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా అనుముల మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, మండల ఎంపీడీఓ సుజాత, వైస్ చైర్మన్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు, మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు ఉన్నారు.

దేవరకొండ : దేవరకొండ మున్సిపాల్టీ పరిధిలోని ఆయా వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీలను దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, కమిషనర్ భాస్కర్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డిండి : మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఆదర్శ పాఠశాల విద్యార్థులు, అధికారులు స్వచ్ఛదనం, పచ్చదనంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా మండలంలో గ్రామాల్లోని వీధుల గుండా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు సంబంధితాధికారులు తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.డానియల్, పంచాయతీ కార్యదర్శి జంగయ్య, మాజీ ఎంపీటీసీ ఏటి.రాధిక కృష్ణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు గ్రామాల్లో గ్రామసభను ఏర్పాటు చేసి స్వచ్ఛదనం, పచ్చదనం ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భిక్షంరాజు, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు: మండల కేంద్రంలో అధికారులు సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఅఓ రమేష్, కార్యదర్శి లింగయ్య, అధికారులు పాల్గొన్నారు.



హాలియా : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనుపమరెడ్డి



తిరుమలగిరి : ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చింతపల్లిలో ..



పెద్దవూర : మొక్క నాటుతున్న డీటీడీఓ

చింతపల్లి : మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామనపంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ద్వారక్, ఎంపీడీఓ సుజాత, ఏపీఓ శౌరిరెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ సాధ్యం

పెద్దవూర : చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మినీ గురుకుల పాఠశాలలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, మండల వైద్యాధికారి నగేష్, ఏపీఎం లలిత, జీహెచ్‌ఎం తరిరాము, కార్యదర్శి విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

త్రిపురారం : కలసికట్టుగా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని మండల ప్రత్యేక అధికారి వందనం శ్రీదేవి అన్నారు. సోమవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎన్నెస్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ కుమారి, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎంపీఓ సుధీర్‌కుమార్, రాజేంద్రకుమార్, గోపాల్‌రెడ్డి పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

అడవిదేవులపల్లి : గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఛాయదేవి, ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా టూ కే రాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోహసిన్ బిన్ అహ్మద్, పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, ఏపీఓ ఏపీఎం శేషయ్య ఉన్నారు.



డిండి : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



నిడమనూరులో..



అడవిదేవులపల్లిలో..



త్రిపురారంలో మొక్కలు నాటుతున్న అధికారులు

దేవరకొండ డీఎల్‌పీఓ బదిలీ

నల్లగొండ : జిల్లా పంచాయతీ శాఖలోని దేవరకొండ డీఎల్‌పీఓగా పనిచేస్తున్న రామ్మోహన్‌రావు బదిలీ అయ్యారు. పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా డీపీఓ, డీఎల్‌పీఓ, పీఈఓ, జెడ్పీ సీఈఓలను బదిలీ చేసింది. అందులో భాగంగా దేవరకొండలో పని చేస్తున్న డీఎల్‌పీఓను నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేసింది.

సొంత భవనం ఏర్పాటు చేయాలని వినతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహానికి సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్ అన్నారు. సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భిక్షంరాజుకు విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శివ, బ్రహ్మం, గోపి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తాళ్లగడ్డ 3వ వార్డులో సర్వే నంబరు 60, 61లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, పబ్లిక్ హెల్త్ అధికారులకు తాళ్లగడ్డ వాసులు వినతిపత్రం అందజేశారు. గతంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ సర్వే నంబరులో అక్రమ కట్టడాలను తొలగించినట్లు తెలిపారు. తిరిగి మళ్లి నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన వారిలో బంటు సైదులు, వేణుగోపాల్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలి

- మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : మాడుగులపల్లిలోని కేజీవిబీ పాఠశాలలో సరైన మౌలికవసతులు కల్పించాలని కోరుతూ సోమవారం నల్లగొండలో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పాఠశాలకు చెందిన విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగిందని, 350 మంది విద్యార్థులకు మూడు టాయిలెట్లు, నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన వసతులు కలిగిన భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆటోమెటిక్ అలారం బెల్ బహూకరణ

కొండమల్లేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేసి రిటైర్డ్ అయిన చనగాని ఈదయ్య తన సొంత డబ్బులతో ఆటోమెటిక్ అలారం బెల్‌ను పాఠశాలకు సోమవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.నాగేశ్వర్‌రావు, స్టాఫ్ సెక్రెటరీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జాన్, సరస్వతి, అశోక్, శివ, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసచారి, నజీర్, వెంకటయ్య, యాదయ్య, అశోక్‌రెడ్డి, అంజయ్య, బాలు, నర్సింహ, బాలాజీ పాల్గొన్నారు.

తల్లి పాలలో అన్ని రకాల పోషకాలు



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ

మిర్యాలగూడ టౌన్ : తల్లి పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయని, దీంతో వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుతుందని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖ మమత అన్నారు. సోమవారం పట్టణంలోని విద్యానగర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. బిడ్డపుట్టిన అరగంట లోపే తల్లిపాలను పట్టించాలని, ఆరు నెలల వరకు కూడా తల్లిపాలే పట్టించాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. బిడ్డ తల్లిపాలు తాగడం వలన రోమ్ము కేన్సర్, గర్భాషయ కేన్సర్ వంటివి దూరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా బేగం, అంగన్వాడీ టీచరు సీహెచ్ ఉమారాణి, ఆయా జయమ్మలతో పాటు తల్లులు, గర్భిణులు, బాలింతలు తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీఓ పి.సరళ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకుతల్లిపాలు తాగించాలని, ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. అనంతరం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సందీప్‌కుమార్‌కు రాష్ట్ర స్థాయి సేవా అవార్డు



ప్రకృతి అవార్డు అందుకుంటున్న సందీప్

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన అవిరెండ్ల సందీప్‌కుమార్‌కు సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పర్యావరణ ప్రేమికుల రాష్ట్ర సదస్సులో పకృతి సేవా రాష్ట్ర పురస్కార అవార్డు అందజేశారు. ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దైద వెంకన్న, మహబూబబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నెని చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందున తనకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు వెంకన్న, వెంకటేశ్వర్లు, సూర్య, రహీమ్, బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు దైద శ్రీనివాస్ తదితరులున్నారు.

ఒకే తండా నుంచి ఇద్దరు ఇంజనీర్లుగా ఎంపిక



పంచాయతీరాజ్ ఏఈఈ ఉద్యోగం సాధించిన ధీరావత్ చంద్రశేఖర్, సైదులునాయక్, కళ్యాణ్‌నాయక్

మిర్యాలగూడ : పట్టణంలోని ఏడు కోట్లతండాకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు ఇంజనీర్లుగా ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాల్లో తండాకు చెందిన ధీరావత్ పంతులాల, బుజ్జి దంపతుల కుమారుడు చంద్రశేఖర్ ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో 2020లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆ తరువాత ఎంటెక్ కోర్సుల్లో చేరాడు. అదే సమయంలో తండ్రి పంతులాల్‌కు పక్షవాతం రావడంతో ఏడాదిన్నర పాటు వ్యవసా యం చేశాడు. రోజుకు ఐదారు గంటల పాటు చదివి ఇంజనీరింగ్ ఉద్యోగానికి పరీక్ష రాయగా ఫలి తాల్లో ఏఈఈగా ఎంపికయ్యాడు. అదేతండాకు చెందిన ధీరావత్ సైదులునాయక్ పంచాయతీరాజ్ ఏఈఈగా ఎంపికయ్యారు. తండాకు చెందిన దివ్యాంగుడు బిచ్చాలు, ముత్యాలు దంపతుల ఐదుగురు సంతానంలో నలుగురు కుమార్తెలు కాగా చిన్న కుమారుడు సైదలునాయక్ 2019లో బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కుటుంబ పోషణ కోసం ప్రైవేట్‌గా పనిచేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల ఫలితాల్లో పంచాయతీరాజ్ ఏఈఈగా ఉద్యోగం పొందాడు. ఏడుకోట్లతండా నుంచి ఇద్దరు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లుగా ఎంపికవడంపై పలువురు వారిని అభినందించారు.

హమాలీ కుమారుడు ఏఈఈగా..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన ధనావత్ తిరుపతి-రంగమ్మ దంపతుల కుమారుడు ధనావత్ కళ్యాణ్‌నాయక్ ఇటీవల విడుదలైన టీజీపీఎస్సీలో పరీక్షా ఫలితాల్లో ఏఈఈగా ఉద్యోగం పొందాడు. తండ్రి తిరుపతినాయక్ హమాలి పని చేస్తుండగా తల్లి రంగమ్మ గృహిణి, కళ్యాణ్‌నాయక్ ఉద్యోగం సాధించడంపై కుటుంబ సభ్యులతో పాటు బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్‌లు అభినందించారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పెద్దవూర : గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పున్‌రెడ్డి మంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జీపీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ సఫాయి బంద్ పేరుతో చేపడుతున్న ఒక్కరోజు సమ్మె నోటీసును ఎంపీడీఓ ఉమాదేవికి అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ఊరె ప్రభాకర్, శ్రీనివాస్‌నాయక్, అంజిరెడ్డి, పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

తమ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ వెళ్లకుండా జీపీ కార్మికులను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అరెస్టు చేసి పెద్దవూర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉంచుకుని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో యూనియన్ మండల అధ్యక్షుడు మంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, ఏసు ఉన్నారు.

న్యాయవాది వెంకయ్య మృతి తీరనిలోటు



వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బూర నర్సయ్య గౌడ్

మిర్యాలగూడ టౌన్ : 50 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో రాణిస్తున్న దొంతగాని వెంకయ్య మృతి తీరని లోటని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాజీవ్ చౌక్‌లోని ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ న్యాయవాది దొంతగాని వెంకయ్య సంస్మరణ సభ న్యాయవాది మక్తాల రాములు అధ్యక్షతన నిర్వహించారు. వెంకయ్య మరణించిన తరువాత నేత్రదానం చేసినట్లు తెలిపారు. అనంతరం వెంకయ్య మృతిపై సంతాపం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, మిర్యాలగూడ బార్ అసోసియేషన్ కార్యదర్శి వేలాద్రి, వెంకయ్య అన్న రాములు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యనిర్వాహక రాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, కరుణాకర్, కస్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, సత్యప్రసాద్, అభిరామ్, సైదులు, వెంకయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల ఎమ్మెల్యే తనిఖీ



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ : పట్టణంలోని గాంధీపార్క్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు టాయిలెట్స్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు తెలపడంతో కాంట్రాక్టర్‌ను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం లోపు టాయ్‌లెట్స్ పూర్తి చేయాలని ఆదేశించారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం



అడవిదేవులపల్లి : సభ్యత్వం అందజేస్తున్న సంఘం నాయకులు

అడవిదేవులపల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం అవుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, కాలం నారాయణరెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కిశోర్‌నాయక్, రంగారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కాశీయాదవ్, గోపినాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, అంబటి శ్రీను, శ్రీనివాస్‌రావు, శోభ, భగవాన్ నాయక్, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, వీరేస్ తదితరులున్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రోడ్డులో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్ ఫణికుమార్, కాలం నారాయణరెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణానాయక్, సంఘం రాష్ట్ర నాయకులు కాశీయాదవ్, జిల్లా నాయకులు నాగలత, హబీబా, రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, కి శోర్, రంగారెడ్డి, శ్రీను, కృష్ణయ్య, సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి స్కూల్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు వేస్తున్న విద్యార్థులు

హాలియా : పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో సోమవారం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. మాక్ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి విద్యార్థులు పోటీలో నిలిచారు. మాక్ పోలింగ్‌లో విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నిమ్మల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు. ఎన్నికల విధానంపై అవగాహన ఉండేందుకు పాఠశాల్లో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.